క్లుప్తంగా

పట్టణంలో పోలీసుల కవాతు



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ వి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించేందుకు, వారికి అండగా మేము ఉన్నామనే భరోసా ఇవ్వడానికి ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉన్నా.. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తున్నా మా దృష్టికి తీసుకువస్తే వాటిని మొదట్లోనే తుంచివేస్తామని తెలిపారు. పట్టణ ఎస్ఐ-2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వార్లకు ప్రత్యేక పూజలు



రథోత్సవం నిర్వహిస్తున్న బ్రాహ్మణ భక్తులు

ఆదోని అర్బన్: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన మహోత్సవంలో భాగంగా రెండోరోజు సోమవారం స్థానిక శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి వారికి, రాఘవేంద్రస్వాములకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ భీమసేన ఆచారి ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్ ఆచారిలు స్వాముల విగ్రహాలకు ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తేనాభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసీ అర్చన, కనకాభిషేకం, శ్రీ రాఘవేంద్రస్వామి అష్టోత్తర హోమం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

లింగాకర్షక బుట్టల పంపిణీ



రైతులకు బుట్టలు పంపిణీ చేస్తున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పత్తి పంటను సాగు చేస్తున్న రైతులకు గులాబీ పురుగు నియంత్రణ కోసం లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, దేవనకొండ, పెద్దకడుబూరు మండలాల నుంచి వచ్చిన రైతులకు గులాబీ రంగు పురుగును ఎలా నియంత్రించాలో అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో శివశంకర్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మార్కెట్ సమీపంలో వైన్‌షాపు వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వైన్‌షాపును ఏర్పాటు చేయవద్దని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ సమీపంలో వైన్‌షాపు ఏర్పాటుతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అటుగా వెళ్లే పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, అఖిల భారత రైతు కూలీ సంఘ మండల నాయకులు ఏసేపు, అగస్టీన్, మాబ్బాషా, రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సీట్ల సర్దుబాటు విషయంలో అవినీతికి పాల్పడిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఆర్‌పీఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, ఆర్‌యూఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పీవీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మెరిట్ వచ్చిన విద్యార్థులకు సీటు ఇవ్వకుండా మెరిట్ రాని విద్యార్థులకు సీటు ఇవ్వడం జరిగిందన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం పట్టణ నాయకులు రాముడు, కృష్ణ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలను సీపీఎం నాయకులు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కాలనీలో రోడ్లు గుంతలమయమయ్యాయని, డ్రైన్లు శిథిలం కావడంతో మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీలు పునర్నిర్మించాలని కోరారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు



రాయనగర్ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు,



బసాపురం గ్రామంలో పొంగి పొర్లుతున్న వంక నీటిలో నిలబడిన గ్రామస్తులు

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు పట్టణ శివారు ప్రాంతమైన రాయనగర్‌తో పాటు పలు కాలనీలో మోకాళ్లలోతూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. మాధవవరం రోడ్డులోని ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న రహదారి నీటి మడుగులను తలపిస్తోంది. ఆదోని నుంచి శిరుగుప్ప, మాధవవరం వరకు వెళ్లే వాహనాలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆటో బురదలో ఇరుక్కు పోవడంతో ప్రయాణికులు బండిని తోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పట్టణంలోని ఆస్మియా పురపాలక ఉర్దూ పాఠశాల, అర్థగేరి తిమ్మారెడ్డి పురపాలక ప్రాథమిక పాఠశాల, నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఏర్పడి విద్యార్థులకు ఇబ్బందులు కలిగించాయి. ఆస్పరి రహదారిలోని రహదారి నీటి మడుగును తలపిస్తోంది. పట్టణానికి సమీపంలో ఉన్న 104 బసాపురం గ్రామ సమీపంలో వంకపొంగి నీరు ప్రవహించడంతో రాక పోకలకు అంతరాయం కలిగింది.

కర్ణాటక-ఆంధ్రకు నిలిచిపోయిన రాకపోకలు

ఆదోని రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. గ్రామాలన్నీ వర్షపునీటితో తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షాలకు మండలంలోని పెద్దహరివాణం గ్రామశివారులో ఉన్న పెద్ద వంక పొంగి పొర్లింది. దీంతో కర్ణాటక- ఆంధ్ర రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప పట్టణం నుంచి ఆంధ్ర రాష్ట్రంలోని పెద్దహరివాణం -ఆదోనికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కర్ణాటక, ఆంధ్ర ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బసాపురం గ్రామానికి కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

మండలంలోని బసాపురం గ్రామానికి కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వెంకటేష్‌చౌదరి, ఈరన్న, మల్లయ్య తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పొంగి పొర్లుతున్న వంకను చూపుతూ మాట్లాడారు. అధిక వర్షాలతో వంక పొంగి పొర్లడంతో ఆదోని నుంచి బసాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు.

వర్షపాతం ఇలా..

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ ప్రాంతంలో అత్యధికంగా ఆదోని మండలంలో 59.6 మిల్లీ మీటర్లు వర్షం కురువగా.. అత్యల్పంగా మంత్రాలయం మండలంలో 7.8 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. పెద్దకడబూరులో 38.6, కౌతాళం మండలం 36.8, ఎమ్మిగనూరు మండలంలో 30.2, గోనెగండ్ల మండలంలో 22.6, నందవరం మండలంలో 20.8, కోసిగి మండలంలో 18.2 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది.

పాఠశాల ప్రాంగణమంతా జలమయం...

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్‌కాలనీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రాంగణమంతా జలమయమయ్యింది. దీంతో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలో మొత్తం 271 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వర్ష కురిసినప్పుడల్లా పరిస్థితి ఇలాగే ఉంటుందని, అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో గరుసు వేసి చదును చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉన్న వర్షపునీరు



ఆంధ్ర సరిహద్దు పెద్దహరివాణం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవంకను ప్రమాదకరంగా దాటుకుంటూ వస్తున్న ప్రజలు

మంత్రాలయంలో భారీ వర్షం



మంత్రాలయం సమీపంలో వరి పొలంలో వర్షపు నీరు

మంత్రాలయం రూరల్ : మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వాన కురవడంతో పంట పొలాల్లో నీరు చేరింది. ఎగువన ప్రాంతాలైన బుదూరు, కల్లుదేవకుంట, సుగూరు, వగరూరు తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుడటంతో వరి పొలాల్లో నీరు చేరి పంటలు దెబ్బతీంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వానలకు వంకలు, వాగులు పొంగిపొర్లాయి. అలాగే మంత్రాలయం సమీపంలోని నాగలదిన్నె రోడ్డులోని పెద్ద ఒత్తు వంక కంప చెట్లు, జంబ్బుతో నిండిపోవడంతో పక్కనున్న వరి పంటలో నీరు చేరింది. దీంతో వరి పంటలో నీరు నిలిచిపోయింది. రాత్రి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం వంకలో వరద నీరు తగ్గడంతో రాకపోకలు పునరుద్ధరించారు.

వైభవంగా భద్రావతి, భావనారుషీంద్రుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



హాజరైన భక్తులు

ఆదోని టౌన్: శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలో హనుమాన్ నగర్‌లో వెలసిన భద్రావతిదేవి, భావనారుషీంద్రుల ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మార్కండేయస్వామి, శివపార్వతులు, అభయాంజనేయస్వామి, నవగ్రతదేవమూర్తులకు రుద్రాభిషేకం తదితర విశేష పూజలు చేపట్టారు. భద్రావతి, భావనారుషీంద్రులకు గణపతి హోమం, అభిషేకం, నవగ్రహ హోమం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భద్రావతి, భావనారుషీంద్రుల కల్యాణం భక్తులు, వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి పల్లకీలో ఊరేగించారు. స్వామివారి భక్తుడు జేరుబండి నరసన్న రూ.1.80 లక్షలు విలువ చేసే వేదమూర్తుల వెండి విగ్రహాలను బహూకరించాడు. ఆలయ కమిటీ నిర్వాహకులు దాత జేరుబండి నరసన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేయడానికి వర్షపు నీటిలో ట్రాక్టర్‌పై వెళ్లుతున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని నెట్టేకల్లు తిక్కయ్య(30) ఆదివారం రాత్రి గుండె పోటు రావడంతో 9గంటల సమయంలో ఆదోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున చనిపోయినాడు. మృతుడుకి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి సోమవారం ముచ్చగిరి గ్రామానికి వెళ్లాడు. గ్రామం సమీపంలోని చల్లమ్మ వంక వర్షపు నీటితో పొంగిపొర్లుతుండటంతో గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బంది ఎదురైంది. అయినా వెనుతిరుగక గ్రామంలోని ట్రాక్టరును తెప్పించుకొని దానిపై గ్రామంలో వెళ్లి తిక్కయ్య మృతదేహానికి పూల మాల వేసి నివాళలర్పించారు. మృతుని కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయం చేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు సర్పంచ్ బోయ హనుమంతుడు, రైతువిభాగం డివిజన్ అధ్యక్షుడు యల్లప్ప, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నులిపురుగును నిర్మూలిద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న సబ్‌కలెక్టర్, అధికారులు

ఆదోని రూరల్: ఒక్క మాత్రతో నులిపురుగును నిర్మూలిద్దామని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. పాఠశాలలు, అంగన్వాడీల్లోని పిల్లలందరికీ ఉచితంగా నులిపురుగుల నివారణ మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘురాంరెడ్డి, మెడికల్ ఆఫీసర్ షాహినాజ్‌బేగం, సబ్ యూనిట్ ఆఫీసర్ మంజునాథ్, ఎంపీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎద్దుల మార్కెట్ వద్ద సోమవారం ఉదయం ఆటోకు పంది అడ్డువచ్చి అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. గోనెగండ్లకు చెందిన శివుడుతో పాటు మరి కొందరు ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకొని ఆటోలో స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఎద్దుల మార్కెట్ వద్ద పంది ఆటోకు అడ్డురాగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శివుడితో పాటు మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం 108 లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శివుడికి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం అందించిన అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లో పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-1 రాంభూపాల్ రెడ్డి సూచించారు. పురపాలక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ-1)పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన సూచనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు.

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన కూటమి

ఎమ్మిగనూరుటౌన్: దొంగ ఓట్లు, ఈవీఎం ట్యాంపరింగ్‌లతోనే ఎన్‌డీఏ కూటమి గద్దెనెక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఖాశిం వలి ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద పార్టీ శేణులు నిరసన తెలిపారు. వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్, ఆసిఫ్, ఖాశింవలి, హజరత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టుబోర్డు నియామకానికి నోటిఫికేషన్

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ నియామకానికి దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను దేవాలయ కార్యాలయానికి పంపవచ్చు అన్నారు.

సచివాలయ నిర్మాణాలు చేపట్టాలి

పెద్దకడబూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ జయరాముడుకు వినతిపత్రం సమర్పించారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



దివ్యాంగురాలి సమస్యను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆదోని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు బాలవర్ధిరాజు, ఆర్డీఓ పరిపాలన అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సూగూరేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



ఆలయంలో హోమాలు చేస్తున్న వేదపండితులు జగదీష్ స్వామి



ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందించిన విరాళం నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెం ఊరువాకిలి సమీపంలో వెలసిన శ్రీ సూగూరేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదోనికి చెందిన వేదపండితులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో గోమాత పూజ, హోమాలు నిర్వహించి వేదమంత్రోచ్చరణల మధ్య నూతన గణపతి, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠాపన చేసి పూజలు చేపట్టారు. పురాతన కాలంలో నిర్మించి ఆలయం కావడంతో కాలనీకి చెందిన భక్తులు సహకారంతో ఆలయం మరమ్మతు పనులు చేయించి నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన తనయుడు యువనేత వై. ధరణీధర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ఆలయ జీర్ణోద్ధారణకు రూ.50వేలు విరాళం అందజేశారు. నగదును కోసిగి వైఎస్సార్ సీపీ మండల నాయకులు గానిగ వీరస్వామి, కొరివి నాగరాజు, కట్టెల నరసింహులు, అంజి, ప్రవీణ్ కుమార్, వేమారెడ్డిలు ఎమ్మెల్యే కుటుంబం పేరు మీదుగా ప్రత్యేక పూజలు చేసి నగదు ఆలయ కమిటీ పెద్దలు బుక్కిటి వీరేష్, ఉమేష్ గౌడ, ఉప్పర లక్ష్మన్న, నరసింహులు, కృష్ణలకు అందించారు. పూజలనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రమణీయం.. మార్కండేయ స్వామి రథోత్సవం



కలశాలతో రథం ముందు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, (ఇన్‌సెట్)రథంపై కొలువుతీరిన ఉత్సవమూర్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వెలసిన పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. శ్రావణ మాసం మాగశుద్ధ మూడవ సోమవారం పురస్కరించుకుని స్వామి వారి మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం శివపార్వతి, మార్కండేయ స్వామిల ఉత్సవ మూర్తిని రథంపై కొలువుంచి కలశాలు, మేళతాళాలతో ఆలయం చెంత నుంచి పురవీధుల గుండా కడపాళెంలోని ఈశ్వర దేవాలయం వరకు లాగారు. తిరిగి అక్కడి నుంచి బయలు దేరి ఊరువాకిలి మీదుగా ఆలయం చెంతకు చేర్చారు. పద్మశాలి కులబాంధవులు ఊరేగింపులో స్వామి వారి ఖడ్గాలు ఉచ్చరిస్తూ, నందికోళ్లు ఆడిస్తూ ఊరేగింపు ముందుకు సాగారు. ఉత్సవాలకు ఊరేగింపు ముగింపు పలికారు.



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి



ఇసుక వేస్తే రాలనంత జనం

ఉరుకుంద క్షేత్రం.. భక్తజన సంద్రం

- మార్మోగిన ఈరన్నస్వామి నామస్మరణ
- భక్తిశ్రద్ధలతో శ్రావణ మూడో సోమవారం పూజలు



లక్షపుష్పార్చనకు పూలు తీసుకుని వస్తున్న డీసీ వాణి



తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా ఈరన్నస్వామి నామస్మరణతో ఉరుకుంద క్షేత్రం పునీతమైనది. ఆలయ (పరిసరాల్లో ఎటూ చూసిన సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు ఇసుక వేస్తే రాలనంతగా భక్తజనంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. దేవాలయానికి చేరుకునే దారులన్నీ భక్తులతో దర్శనమిచ్చాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు మనరాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి తరలివచ్చారు. భక్తులు ముందుగా ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూలైన్లో నిలుచుకున్నారు. సుమారు నాలుగు లక్షల మంది పైగా భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని అంచనా. ఎటు చూసినా వాహనాలు, జనాల గమ్యం ఉరుకుంద వైపే కొనసాగాయి. మూడవ సోమవారం పురస్కరించుకోని ఆదివారం ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరడం విశేషం. సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడితో స్వామి క్షేత్రం పునితమైంది. రాత్రి 8గంటలైన దర్శనంకోసం ఉన్న క్యూలైన్లు భక్తులతో దర్శనమిచ్చాయి. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చోటు దొరికితే అక్కడే వంటలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించడం కనిపించింది. ఉరుకుందకు వచ్చే నాలు వైపుల రోడ్లు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌తో నిండి పోవడంతో భక్తులు అక్కడే పొలాల్లోనే వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

దర్శనానికి 2గంటల నిరీక్షణ

భక్తులకు రద్దీ కారణంగా దర్శనం కోసం 2 నుంచి 3 గంటల పాటు నిరీక్షించాల్సిన వచ్చింది. మూడు కల్యాణ కట్టాలు ఏర్పాటు చేసినా భక్తుల రద్దీతో అవి ఏమాత్రం సరిపోలేదు. ఇక్కడ కూడా భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు మంగళవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎక్సైజ్ కార్యాలయం అవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన 25 వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో వేలాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆశక్తి గల వారు వేలాల్లో పాల్గొనవచ్చన్నారు.